నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శుక్రవారం 3 మే 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

బీఆర్ఎస్‌లో 50 మంది చేరిక

బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్

బెజ్జూర్, మే 2 : మండల కేంద్రంలో గురువారం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపుకోసం ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండె విఠల్ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సమక్ష్యంలో బెజ్జూర్ మాజీ ఎంపీటీసీ నాయిన భాగ్య, కాంగ్రెస్ ముఖ్య నేత రంగు సురేశ్ గౌడ్ ఆధ్వర్యంలో 50 మంది కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్సీ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపుకోసం కృషి చేస్తామని కార్యకర్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సోయం చిన్నయ్య, సామల రాజన్న, రౌతు లచ్చన్న, మేర్గు రమేశ్, అస్లాం ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ విప్ బాల్కసుమన్

కేసీఆర్ బస్సు యాత్రతో కాంగ్రెస్, బీజేపీల్లో వణుకు

- దేశంలో ఏ నాయకుడిపైనా లేని విధంగా 48 గంటల నిషేధం
- దొంగ హామీలపై ప్రశ్నిస్తుంటే బెంబేలెత్తిపోతున్నరు
- వివేక్ కుటుంబానికి అన్ని కోట్ల ఆస్తులెక్కడివి?
- ఐకే రెడ్డి పార్టీ మారడం నీతిమాలిన చర్య
- విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ విప్ బాల్క సుమన్
- బీఆర్ఎస్‌కు అండగా నిలవాలి
- మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

మంచిర్యాలలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాల్క సుమన్, దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్, మే 2 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బస్సు యాత్రను చూసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వణుకు పుడుతుందని, అందులో భాగంగానే దేశంలో ఏ నాయకుడిపైనా లేని విధంగా 48 గంటల నిషేధం విధించారని బీఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ విప్ బాల్క సుమన్ మండిపడ్డారు. గురువారం మంచిర్యాలోని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు నివాసంలో దివాకర్‌రావుతో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీ అరాచకాలు, దొంగ హామీలపై కేసీఆర్ బస్సు యాత్రలో ప్రశ్నిస్తుంటే ప్రతిపక్షాలు బెంబేలెత్తిపోతున్నాయని, బీఆర్ఎస్ పార్టీకి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక మతం, రిజర్వేషన్లు అంటూ కొత్త డ్రామాలకు తెర తీస్తున్నారని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్, బీజేపీల మధ్యలో పాయికార ఒప్పందం ఉన్నదని, అందులో భాగంగానే ఒకరికొకరు సహకరించుకుంటున్నారని, వాళ్లకు కావాల్సిన సీట్లలో బలహీనమైన అభ్యర్థులను పెడుతున్నారని తెలిపారు. దేశంలో బీజేపీ, కాంగ్రెస్‌లు తప్ప.. ఇతర పార్టీలేవీ ఉండకూడదన్న ఆలోచనతోనే వారు కలిసి పనిచేస్తున్నారని చెప్పుకొచ్చారు. దేశ ప్రధాని మోదీ తెలంగాణ పర్యటన సందర్భంగా 'రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నాడంటూ' స్వయంగా ఆయనే విమర్శించారని, అయినా రేవంత్ రెడ్డిపై ఈడీ, సీబీఐ దాడులు ఎందుకు జరగడం లేదో ప్రజలు అర్థం చేసుకోవాలని అన్నారు. కేసీఆర్‌ది కుటుంబ పాలన అని విమర్శించిన కాంగ్రెస్ పెద్దలు మరి గడ్డం వివేక్, వినోద్‌కు ఎమ్మెల్యే పదవులు ఇచ్చి, ఇప్పుడు పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థిగా వివేక్ కొడుకుకు టికెట్ ఎలా కేటాయించారని, ఇది కుటుంబ పాలన కాదా అని ప్రశ్నించారు. పెద్దపల్లి పార్లమెంటు పరిధిలో, కాంగ్రెస్ పార్టీలో వేరే దళితులే లేరా అని ప్రశ్నించారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజక వర్గం వివేక్ కుటుంబ గుత్తాధిపత్యమా? అని ప్రశ్నించారు. దేశంలో ఎన్నో గొప్ప పదవులు అనుభవించిన దళిత నాయకులెవ్వరూ సంపాదించని విధంగా వివేక్ కుటుంబానికి అన్ని వేల కోట్లు ఎలా వచ్చాయో చెప్పాలని డిమాండ్ చేశారు. కాకా కుటుంబ సభ్యులు పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ స్థాయిలో ఏ దళిత నాయకుడూ ఎదగకుండా కుట్రలు చేశారని చెప్పుకొచ్చారు. చెన్నూరు నియోజకవర్గంలో 10 లక్షల మీటర్ల ఇసుక తవ్వకాలకు త్వరలోనే జీవో జారీ చేయడానికి కాంగ్రెస్ పథకాలు రచిస్తుందని తెలిపారు.

ఐకే రెడ్డి పార్టీ మారడం నీతిమాలిన పని

మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడం నీతిమాలిన పని అని బాల్క సుమన్ ఫైర్ అయ్యారు. ఎంతో మందిని కాదని రెండుసార్లు మంత్రి పదవులను ఇచ్చి, నిత్యం తన పక్కనే స్థానం కల్పించి, గౌరవం ఇచ్చిన పార్టీకి వెన్నుపోటు పొడవడం హేయమైన చర్య అని మండిపడ్డారు. ఆయన తీసుకున్న నిర్ణయం తిన్నింటి వాసాలు లెక్కిపెట్టిన చందంలా ఉందని, ఆయనకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. ఈ నెల 4న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మంచిర్యాలలో నిర్వహించే రోడ్ షోను విజయవంతం చేయాలని కార్యకర్తలు, నాయకులు, ప్రజలకు పిలుపునిచ్చారు.

బీఆర్ఎస్‌కు అండగా నిలవాలి : మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

ప్రజా సంక్షేమం కోసం పాటు పడిన బీఆర్ఎస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో అండగా నిలవాలని మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు పిలుపునిచ్చారు. ఏడాది పొడవునా సాగు, తాగు నీరందించామని, నిరంతర విద్యుత్ సరఫరా చేశామని, రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ఆసరా పింఛన్లు, కేసీఆర్ కిట్లు, మెరుగైన విద్య, వైద్యంవంటి ఎన్నో గొప్ప పనులు చేశామని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, సాగు, తాగునీరు లేక అల్లాడుతున్నారని, కరంటు కోతలతో సతమతమవుతున్నారని, కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు చేయలేదన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గాదెసత్యం, కౌన్సిలర్ అంకం నరేశ్, నాయకులు ఎర్రం తిరుపతి, శ్రీపతివాసు, తాజుద్దీన్, శ్రీరాముల మల్లేశ్, నస్పూరు అధ్యక్షుడు సుబ్బయ్య పాల్గొన్నారు.

మొదట గెలిచేది పెద్దపల్లి ఎంపీ సీటే

- కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత
- అల్లోల స్వార్థం కోసం పార్టీ వీడిండు
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్
- బెల్లంపల్లిలో ముఖ్య కార్యకర్తలతో సమావేశం
- ధనికుడికి, పేద బిడ్డకు మధ్య పోటీ : బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

నెన్నెలలో రోడ్ షోలో పాల్గొన్న ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

బెల్లంపల్లి, మే 2 : రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మొదట గెలిచేది పెద్దపలి ఎంపీ సీటేనని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ స్పష్టం చేశారు. గురువారం రాత్రి బెల్లంపల్లిలోని తిరుమల హిల్స్‌లోని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య నివాసంలో బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్ అధ్యక్షతన నిర్వహించిన బెల్లంపల్లి నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, బెల్లంపల్లి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు గంట రాములు యాదవ్‌తో కలిసి మాట్లాడారు. మోదీ, అమిత్ షా, రేవంత్‌లు ఎన్ని అనుచిత వాఖ్యలు చేసినా స్పందించని ఈసీ.. బీఆర్ఎస్ అధినేత ప్రచారంపై నిషేధం విధించడమేమిటని ప్రశ్నించారు. ప్రచారానికి 48 గంటలు ఆపితే 20 నుంచి 30 లక్షలు ఓట్లు బీఆర్ఎస్‌కు పెరిగినట్లేనని తెలిపారు. నాలుగు నెలల్లోనే కాంగ్రెస్ పాలనపై తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, ఈ ఎంపీ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌వైపు మొగ్గు చూపుతున్నారని పేర్కొన్నారు. రెండు సార్లు మంత్రి పదవి పొందిన అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి తన స్వార్థం కోసం కాంగ్రెస్ పార్టీలో చేరారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'దొంగలు పోతరు..ఇంకా పోతరు.. కానీ నీతి నిజాయితీగా ఉండేవారు మాత్రమే బీఆర్ఎస్ పార్టీలో ఉంటారు' అని స్పష్టం చేశారు. హామీలను నమ్మి గద్దెనెక్కించిన ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం నట్టేట ముంచిందని, ఇప్పుడు ప్రజలంతా తప్పు చేశామనే భావనలో ఉన్నారన్నారు. ఉచిత ఆర్టీసీ బస్సు పథకం తీసుకొచ్చి మంచి చేసినా.. ఆటో డ్రైవర్లకు మాత్రం న్యాయం చేయలేక పోయారని చెప్పారు. దుర్గం చిన్నయ్యపై నిందలు వేసిన బోడపాటి షేజల్ ఇప్పుడు ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. కాకా కుటుంబం దళిత రిజర్వేషన్ వాడుకొని వేల కోట్లకు పడగలెత్తుతున్నదని విమర్శించారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ ధనికుడికి, పేద బిడ్డకు జరుగుతున్న ఎన్నిక ఇదని, సింగరేణి కార్మిక కుటుంబం నుంచి వచ్చిన తనకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ ప్రస్తుతం నియోజకవర్గంలో ఏ సంక్షేమ పథకం కావాలన్నా హైదరాబాద్‌కు వెళ్లాల్సిన దుస్థితి వచ్చిందని తెలిపారు. ఇంటింటికీ తిరుగుతూ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు ఓటు వేయాలని గట్టిగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. ఈనెల 4న మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రోడ్ షోను విజయవంతం చేయాలని కోరారు. లోక్‌సభ ఎన్నికల్లో ఏడు నుంచి తొమ్మిది సీట్లు బీఆర్ఎస్ సాధిస్తుందని సర్వే ఫలితాలు చెబుతున్నాయన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, పట్టణ అధ్యక్షుడు నూనెటి సత్యనారాయణ, టీబీజీకేఎస్ శాంతిఖని పిట్ కార్యదర్శి దాసరి శ్రీనివాస్, నాయకులు వెంకటరమణ, రాజనాల రమేశ్, కౌన్సిలర్లు గోసిక రమేశ్, కొక్కెర చంద్రశేఖర్, గడ్డం అశోక్‌గౌడ్, కో ఆప్షన్ సభ్యుడు సాజి ద్, వాజిద్,పోలు శ్రీనివాస్, కే.రమేశ్, బీ.వెంకటేశ్, ఆవుల రవికిరణ్, రాజయ్య, సాయి క్రిష్ణ, సాగర్, లింగాల కిరణ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను నమ్మితే నట్టేట ముంచింది

నెన్నెల, మే 2 : కరోనా కాలంలోనూ రైతుబంధు ఇచ్చి ఆదుకున్న ఘనత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌దేనని పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. గురువారం నెన్నెల మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి లేనిపోని హామీలిచ్చి రైతులు, ప్రజలను నట్టేట ముంచిండని మండిపడ్డారు. రైతుబంధు ఇవ్వకుండా కాలయాపన చేస్తూ రైతులను అప్పుల పాలు చేసిండన్నారు. హామీల కోసం అడిగితే దేవుళ్ల మీద ఒట్లేస్తూ కాలం వెళ్లదీస్తున్నాడన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో మహాలక్ష్మి పథకం తప్ప మిగతా ఐదు పథకాల అమలు ఇంకెప్పుడు అని నిలదీశారు. పథకాల కోసం ప్రశ్నిస్తే పేగులు తీస్తా.. అంటూ ముఖ్యమంత్రి మాట్లాడడం సిగ్గు చేటన్నారు. ఇలాంటి వారికి ఎన్నికల్లో కర్రు కాల్చి వాత పెట్టాలన్నారు. మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య పాల్గొన్నారు.

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ బదావత్ సంతోష్

సమావేశంలో పాల్గొన్న ఎన్నికల అధికారులు

నస్పూర్, మే 2 : పార్లమెంట్ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో ఎన్నికల అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ రాహుల్, మంచిర్యాల ఆర్డీవో రాములు, చెన్నూరు రిటర్నింగ్ అధికారి చంద్రకళతో కలిసి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ కంట్రోల్ యూనిట్, బ్యాలెట్, వీవీ ప్యాట్‌ల అనుసంధానంపై ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మాక్ పోలింగ్ ప్రక్రియ నిర్వహించిన అనంతరం పోలింగ్ నిర్వహించాలని తెలిపారు. ఎన్నికల సామగ్రి, ఈవీఎం, వీవీ ప్యాట్లు, బ్యాటరీలు, పేపర్లు, డై రీ నిర్వహణ తదితర అంశాలన్నీ పరిశీలించాలన్నారు. రిసెప్షన్ కేంద్రం వద్ద ఆ హారంతో పా టు తాగునీటి సదుపాయం క ల్పించేలా సహా య రిటర్నింగ్ అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న వారు పోస్టల్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. సహాయ రిటర్నింగ్ అధికారులు వెబ్ కాస్టింగ్ ద్వారా ఫెసిలిటేషన్ కేంద్రాల్లో జరిగే పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పర్యవేక్షించాలని, తహసీల్దార్‌లు ప్రతి రోజూ బ్యాలెట్ సంబంధిత నివేదికను అందించాలన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయం

బెల్లంపల్లి తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ(సీవోఈ) విద్యార్థులు పదోతరగతి లో ఉత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయమని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో 10 జీపీఏ సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ బెల్లంపల్లి సీవోఈ విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించారని, 74 మంది విద్యార్థులకుగాను 74 మంది ఉత్తీర్ణత సాధించడం గొప్ప విషయమన్నారు. 10 జీపీఏతో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిన అభినయ్ తేజ్, వినయ్, జశ్వంత్, వినిల్‌కుమార్, ప్రణయ్‌చరణ్, శశివర్ధన్‌లను ఆయన అభినందించారు. కార్యక్రమంలో డీఈవో యాదయ్య, ప్రిన్సిపాల్ ఐనా ల సైదులు, ఉపాధ్యాయులు ప్రమోద్‌కుమార్, వామన్ ఉన్నారు.

నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితేష్ వ్యాస్

వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్ టౌన్,మే 2 : లోక్‌సభ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని, అధికారులు, సిబ్బంది విధుల్లో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితేష్ వ్యాస్ అన్నారు. గురువారం న్యూఢిల్లీ నుంచి సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితేష్ వ్యాస్, హైదరాబాద్ నుంచి ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులతో పోలింగ్ నిర్వహణ, సన్నద్ధతపై సమీక్ష నిర్వహించారు. వారు మాట్లాడుతూ సెక్టార్ అధికారులు పోలింగ్ నిర్వహణలో కీలక పాత్ర పోషించాలన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు పని చేయని పక్షంలో నూతన యంత్రాలు ఏర్పాటు చేసే సమయంలో పాటించాల్సిన నిబంధనలపై సెక్టార్ అధికారులకు పూర్తి స్థాయిలో శిక్షణ అందించాలని తెలిపారు. పోలింగ్ నిర్వహణపై సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారాలు జరిగే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని, క్షేత్రస్థాయిలో వచ్చే చిన్న, చిన్న ఇబ్బందులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించాలని సూచించారు. కలెక్టర్ వెంకటేశ్ దోత్రే మాట్లాడుతూ అర్హులందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్పీ సురేశ్‌కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను నమ్మి మోసపోవద్దు

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న దివాకర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు

- ప్రజల కోసం పనిచేసే బీఆర్ఎస్‌నే గెలిపించండి
- మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు
- మంచిర్యాలలోని పలు వార్డుల్లో ప్రచారం

మంచిర్యాలటౌన్, మే 2 : పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్‌ను నమ్మి మళ్లీ మోసపోవద్దు, ప్రజలకోసం అహర్నిశలు పనిచేసే బీఆర్ఎస్ కారు గుర్తుకే ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు కోరారు. గురువారం మంచిర్యాల మున్సిపాలిటీలోని 13, 14, 15 వార్డుల్లో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 13న జరుగబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు భారీ మెజార్టీ ఇవ్వాలని ఓటర్లను కోరారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మోసపూరితమైన వాగ్దానాలు చేసి ప్రజల నుంచి ఓట్లు దండుకున్నదని, ఎన్నికల్లో గెలిచాక హామీల సంగతి మరిచిపోయిందని మండిపడ్డారు. ఇప్పటికే రైతుబంధు ఇవ్వలేదని, కౌలురైతుల సంగతి మరిచిపోయారని, మహిళలకు రూ. 2500, పింఛను రూ 4వేలు, రూ. 500కే గ్యాస్, ఆడబిడ్డ పెండ్లికి తులం బంగారం, విద్యార్థులకు రూ. 5 లక్షల భరోసా, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంవంటి హామీలను తుంగలోతొక్కారని, అడిగితే బూతులు మాట్లాడుతున్నారని, ఈ విషయం ఇప్పటికే ప్రజలంతా గమనించారని చెప్పుకొచ్చారు. కాగా, ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న దివాకర్‌రావుకు ప్రజలు తమ సమస్యలు చెప్పుకున్నారు. హమాలీవాడలో తాగునీరు సక్రమంగా రావడం లేదని, వచ్చినా తక్కువ సమయం నీరు వస్తుందని, రోడ్డు నిర్మాణం ముందుకు సాగడం లేదని, దుమ్ముతో సతమతమవుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గాదెసత్యం, కౌన్సిలర్ అంకం నరేశ్, నాయకులు శ్రీపతి వాసు, కర్రు శంకర్, పల్లపు రాజు, బాపు, శ్రీరాముల మల్లేశ్, జెట్టి చరణ్ పాల్గొన్నారు.

కొప్పులను గెలిపించుకోవాలి

సీసీసీ నస్పూర్‌లో ఎన్నికల ప్రచారం

సీసీసీ నస్పూర్, మే 2 : ప్రజల మనిషి.. సింగరేణి కార్మికుడిగా పనిచేసిన కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించుకోవాలని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు కోరారు. గురువారం నస్పూర్ మున్సిపాలిటీలోని 2, 14వార్డుల్లో ఆయన విస్తృతంగా ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి... వ్యాపార సముదాయాల్లో తిరిగి బీఆర్ఎస్ కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ, సమస్యలపై పోరాడే బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మంచిర్యాలలో 4న ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్వహించే రోడ్ షోకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, కార్యదర్శి మేరుగు పవన్, కౌన్సిలర్లు వంగ తిరుపతి, జబీన్‌హైమద్, మాజీ సర్పంచ్ వేల్పుల రాజేశ్, నాయకులు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, పానుగంటి సత్తయ్య, అమృత రాజ్‌కుమార్, దుర్గాప్రసాద్, మండల క్రాంతి, శెట్టి రమణ, పెరుక సత్తయ్య, కొండపర్తి శంకర్, వెంకటేశ్ పాల్గొన్నారు.

వేతనాలివ్వండి

- జీపీ మల్టీ వర్కర్ల డిమాండ్
- నెన్నెల ఎంపీడీవో కార్యాలయం ఎదుట బైఠాయింపు

ఎంపీడీవో కార్యాలయం ముందు బైఠాయించిన వర్కర్లు

నెన్నెల, మే 2 : నాలుగు నెలలుగా వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే ఇప్పించాలని 19 గ్రామ పంచాయతీలకు చెందిన మల్టీ వర్కర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం నెన్నెల ఎంపీడీవో కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఎంపీడీవో దేవేందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వేతనాలు రాక అప్పులు చేసి కుటుంబాలను పోషించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, కార్యదర్శులు పనులు చేయిస్తున్నారే తప్ప తమ ఇబ్బందులను పట్టించుకోవడం లేదన్నారు. ఇకనైనా వేతనాలు అందించాలని, లేదంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు. కార్మికులు కుమార్, వెంకటేశ్, శ్రీనివాస్, స్వామి, మోండి, అనిల్‌గౌడ్, చిలుకయ్య రాజం, మారయ తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బతో ఒకరి మృతి

పొర్తెటి శ్రీనివాస్ (ఫైల్)

బెజ్జూర్, మే 2 : మండలంలోని గబ్బాయి గ్రామానికి చెందిన పొర్తెటి శ్రీనివాస్ (50) గురువారం వడదెబ్బతో మృతి చెందాడు. శ్రీనివాస్ రెండు రోజుల క్రితం బంధువుల పెండ్లికి వెళ్లి తీవ్ర అస్వస్థతతో ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో బుధవారం నుంచి వాంతులు చేసుకున్నాడు. అదేరోజు రాత్రి పరిస్థితి విషమించడంతో కాగజ్‌నగర్‌లోని దవాఖానకు తరలిస్తుండగా మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

- రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్
- కేంద్ర బలగాలు, అధికారులతో సమావేశం

పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న సీపీ

మంచిర్యాల ఏసీసీ, మే 2 : పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. గురువారం రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో కేంద్ర బలగాలు, రామగుండం కమిషనరేట్ పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలని, ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా భరోసా కల్పించాలన్నారు. ఎన్నికల రోజు, ఎన్నికల తర్వాత బందోబస్తు విధులు నిర్వర్తించాలని తెలిపారు. ఎస్ఎస్‌టీ టీమ్స్ డ్యూటీలు, ఎల్‌డబ్ల్యూఈ ఏరియా డామినేషన్, కార్డన్ సర్చ్ ఆపరేషన్స్, విధుల గురించి వారికి వివరించారు. కీలకమైన పాయింట్‌ల వద్ద సెంట్రల్ ఫోర్స్ సిబ్బందిని ఏర్పాటు చేశారన్నారు. కేంద్ర బలగాలు ఉండేందుకు సరైన వసతి కల్పించాలని, వారితో కలిసి పనిచేయాలని ఏసీపీలను ఆదేశించారు. చెక్ పోస్టుల వద్ద విధులు నిర్వహించే సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల భద్రతలో భాగంగా రామగుండం పోలీస్ కమిషనరేట్‌కు రెండు సీఆర్పీఎఫ్, మూడు బీఎస్ఎఫ్ కంపెనీ బలగాలు వచ్చాయని, మొత్తం 443 అధికారులు, సిబ్బంది ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశం మంచిర్యాల డీసీపీ అశోక్ కుమార్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, సీఆర్పీఎఫ్ అడిషనల్ కమాండెంట్ ఏకే.పాండే, బీఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్లు డేవిడ్ లాల్ తన సిమ్మ, భరత్ సింగ్, స్వరూప్ సమంత, డిప్యూటీ కమాండెంట్లు రతన్ లాల్, నరేశ్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, మంచిర్యాల పట్టణ సీఐ బన్సీలాల్, బెల్లంపల్లి రూరల్ సీఐ అష్జల్లొద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.